1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..కాగజ్ నగర్ మండలం వంజిరి నందిగూడకు చెందిన గుర్లె మొండయ్య టీవీఎస్ ఎక్సెల్‌పై అదే గ్రామానికి చెందిన మంథని ప్రభాకర్‌ను తీసుకొని జిల్లా కేంద్రం నుండి కాగజ్‌నగర్ వైపు వెళుతున్నాడు. అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద రాంగ్ రూట్‌లో వెళ్లడంతో బూరుగుడ నుండి వాంకిడి వైపు కారులో వెళుతున్న పోరెడ్డి ప్రేమ్‌కుమార్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. మొండయ్య కాలు తెగిపోయి వాహనంలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రభాకర్‌ను స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం నుండి హైవే ఎక్కాల్సిన వారు రాంగ్ రూట్‌లో వెళ్లకూడదని సీఐ సూచించారు.



సంచార జాతుల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-మంచిర్యాల

సంచార జాతుల జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో ఎన్నుకున్నారు. సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షులు తీపిరిశెట్టి శ్రీనివాస్, కోనేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంచార జాతుల సంఘం గౌరవ అధ్యక్షులుగా తాళ్ల వేణు, జిల్లా అధ్యక్షులుగా మద్దివేణి అర్జున్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల సమ్మయ్యతో పాటు రవికుమార్, పురాణం క్రాంతి, వైద్య భాస్కర్‌ను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



పథకాలకు శ్రీకారం..!

- నేడు నాలుగు పథకాలు లాంఛనంగా ప్రారంభం
- జిల్లాలో తొలి రోజు మండలానికి ఓ గ్రామం ఎంపిక
- అర్హులకు మంజూరు పత్రాలు పంపిణీ
- మిగతా పంచాయతీల్లో మరుసటి రోజు నుంచి అందజేత

ప్రభుత్వం మరో నాలుగు కొత్త పథకాలకు శ్రీకారం చుట్టబోతోంది. ఇప్పటికే అర్హులను ఎంపిక చేసిన ప్రభుత్వం వారికి మంజూరుపత్రాలను అందజేయాలని సంకల్పించింది. కాగా ఈ పథకాలను గణతంత్ర దినోత్సవం రోజున లాంఛనంగా ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం ఇప్పటికే సంసిద్ధమైంది. తొలి రోజున మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి ఈ నాలుగు పథకాలకు సంబంధించి ప్రొసిడింగ్ కాపీలను అందజేయనున్నారు. కానీ శనివారం రాత్రి 7గంటల వరకు కూడా ఆయా మండలాల్లో ఏయే గ్రామాలను ఎంపిక చేశారనే సమాచారం మాత్రం అధికారులకు సైతం తెలియని పరిస్థితి కనిపించింది. ప్రభుత్వం నుంచి రాత్రి వరకు సమాచారం వస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కాగా ఈ పథకాలు ప్రారంభం అవుతుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. తొలి విడతలో ఎంత మందిని ఎంపిక చేస్తారోననే ఉత్కంఠ కూడా అదే స్థాయిలో ఉండటం గమనార్హం.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేస్తోంది. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్ పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యం వంటి పథకాలు కల్పిస్తుండగా.. మరో నాలుగు కొత్త పథకాలను ఆదివారం నుంచి ప్రారంభించబోతోంది. ప్రజా సంక్షేమానికి కీలకంగా భావించే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఆయా పథకాల అమలు కోసం గ్రామసభలు నిర్వహించిన అర్హుల జాబితాలకు ఆమోదం తీసుకుంది. ఈ పథకాల్లో అర్హులందరికీ పరిగణనలోకి తీసుకోలేదని పలు గ్రామాల్లో ఆందోళనలు జరగడంతో అధికారులు గ్రామసభల్లోనే మళ్లీ లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అర్హులందరికీ పథకాలు వర్తిస్తాయని అటు ప్రభుత్వం..ఇటు అధికారులు భరోసా నివ్వడంతో లబ్ధిదారులు ఆశతో ఉన్నారు.

తొలిరోజున మండలానికి ఓ గ్రామం..!

ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు తొలి రోజున మండలానికి ఓ గ్రామాన్ని ఎంపిక చేసి ఇందులో అర్హులైన వారికి ఆయా పథకాలకు సంబంధించి ఎంపికైన లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేయనున్నారు. రైతు భరోసా పథకానికి సైతం రైతులకు ఈ పత్రాలు అందించి సోమవారం నుంచి ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లాలో 2111 ఎకరాలను సాగుకు యోగ్యం లేని వారిని తొలగించి సాగు చేస్తున్న 1.56లక్షల మంది రైతులకు రూ.326.74కోట్లు జమ చేయనుంది. మరోపక్క జిల్లాలో 18,741 మందికి కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి అర్హులను ఎంపిక చేశారు. ఇప్పటికే గ్రామాల వారీగా అందజేసిన జాబితా ప్రకారం కొత్త కార్డులను పంపిణీ చేయనున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద జిల్లాలో 24,438మందిని ఎంపిక చేశారు. మరోపక్క ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి కూడా భారీగా దరఖాస్తులు వచ్చినప్పటికీ తొలి విడతలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేశారు. ఒక్కో గ్రామంలో సుమారు 200 నుంచి 300 వరకు అర్హులను ఎంపిక చేసినప్పటికీ.. తొలి విడతలో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇండ్లు మాత్రమే మంజూరు చేయడంతో గ్రామాల జనాభాను బట్టి ఒక్కో గ్రామంలో 15 నుంచి 20 ఇండ్ల వరకు రావచ్చని అధికారులు చెబుతున్నారు. మిగితా వాటిలో మరుసటి రోజు నుంచి ప్రభుత్వం నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించేందుకు మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసింది. తొలి రోజున వీటిలో సభలు నిర్వహించి పథకాలకు సంబంధించి అర్హులకు మంజూరుపత్రాలను అందజేస్తారు. మిగితా గ్రామాల్లోనూ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు మరుసటి రోజు నుంచి మంజూరుపత్రాలు అందిస్తారని అధికారులు చెబుతున్నారు. తొలి రోజున నిర్వహించే సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం అధికారులకు దిశానిర్దేశం చేసింది. ప్రజలకు తాగునీరు, శామియాన వంటి సదుపాయాలు కల్పించాలని సూచించింది. ఆయా గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు వీటిని ప్రారంభించనున్నారు.



ఆదిలాబాద్ మండలం పిప్పల్‌ధరిలో పథకాల ప్రారంభ కార్యక్రమానికి ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సారంగాపూర్: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నాఫెడ్ - మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కౌట్ల(బి) సొసైటీ ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి క్వింటాల్‌కు రూ.7550 మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం చించోలి(బి) బీటీ రోడ్ నుండి గోదాముల వరకు రూ.90లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం కోసం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిర నారాయణరెడ్డి, మార్కెట్ ఛైర్మెన్ అబ్దుల్ హది, నాయకులు సత్యనారాయణగౌడ్, రావుల రామ్‌నాథ్, మేడిసెమ్మ రాజు, వద్దే రాజేందర్‌రెడ్డి, రామ్‌శంకర్‌రెడ్డి, విలాస్, రాంరెడ్డి, కరుణాసాగర్‌రెడ్డి, పోతన్న, నరేష్, తిరుమలచారి, గణపతి, భోజన్న, విజయ్, నారాయణ నాయక్, ప్రకాష్, సీఈఓ సలీం, మార్కెట్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మానవ తప్పిదాల కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2కే రన్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీఓ కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఆర్టీఓ కార్యాలయంలో బెలూన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణమన్నారు. రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ రూల్స్ తెలియపోవడంతో దుర్ఘటనలు జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించడానికి రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి అల్లె శ్రీనివాస్, ఎంవీఐ కె.రవీందర్, ప్రదీప్ గౌడ్, అశ్వంత్ కుమార్, ఏఎంవీఐలు విద్యధర్‌రెడ్డి, ప్రత్యూష, వినయ్‌కుమార్, హరింద్రకుమార్ పాల్గొన్నారు.


ప్రయివేట్ వాల్వో ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రయివేట్ వాల్వో ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. వాల్వో ఆపరేటర్లకు హెచ్ఎంఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. శ్రీరాంపూర్ హెచ్ఎంఎస్ బ్రాంచ్ కార్యాలయంలో ప్రైవేట్ వాల్వో ఆపరేటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా వాల్వో ఆపరేటర్లు అనేక సమస్యలతో బాధపడుతున్నా సింగరేణి యాజమాన్యం చొరవ చూపినప్పటికీ జివిఆర్ కంపెనీ యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రధానంగా సుప్రీంకోర్టు సూచన ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ఆపరేటర్లను ఆర్థిక దోపిడీకి, శ్రమ దోపిడీకి జివిఆర్ కంపెనీ గురిచేస్తుందని, వారికి తమ సమస్యలను చెప్పుకునే స్వేచ్ఛ కూడా హరించి వేస్తున్నారన్నారు. 14 డిమాండ్లతో వాల్వో ఆపరేటర్లు గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న గాని సమస్యలు పరిష్కారం కోసం ఎలాంటి చొరవ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం జె.వి.ఆర్ యాజమాన్యం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ లో స్థానికేతరులు అందర్నీ వెనక్కి పంపించి 610 జీవోను అమలు చేయాలని, న్యాయమైన 14 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనిచో హెచ్ఎంఎస్ యూనియన్ వోల్వో ఆపరేటర్లకు అండగా ఉండి ప్రత్యక్ష పోరాటాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

చోరీకి పాల్పడ్డ దొంగ అరెస్ట్



కాసిపేట : మండలంలోని ధర్మారావుపేటలో జరిగిన చోరీ కేసును దేవాపూర్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు శనివారం ఎస్ఐ ఆంజనేయులు దొంగను అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ధర్మారావుపేట గ్రామానికి చెందిన గోపు శంకరమ్మ భర్త చనిపోయిన కారణంగా 4నెలల పాటు నివసిస్తున్న ఇంటిని వదిలి వేసింది. అదే గ్రామంలో పాత ఇంటికి వెళ్లి ఉంటున్నారు. నాలుగు నెలల గడువు ముగియగా జనవరి 21న తిరిగి వదిలి వచ్చిన ఇంటికి వెళ్లగా తాళం పగల గొట్టి ఉంది. చెక్క బీరువా తాళం పగలగొట్టి అందులో గల 40 గ్రాముల బంగారం దొంగలించబడినట్లు గుర్తించింది. ఈ విషయమై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా శనివారం తుంగగూడెంకు చెందిన మేకల శశికుమార్ అనుమానస్పదంగా కొండాపూర్ బస్టాండ్ ప్రాంతంలో తిరుగుతుండగా అనుమానించి పట్టుకున్నారు. విచారించగా బీరువాలో దాచి ఉంచిన 15గ్రాముల బంగారు నెక్లెస్, 5 గ్రాముల ఉంగరం, 20 గ్రాముల ముద్ద బంగారం దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వానికి ప్రాజెక్టులపై తాపత్రయం లేదు

- చనాక-కోర్ట బ్యారేజీ పనులను ప్రారంభించాలి
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- బీజేపీ ఎందుకు మౌనంగా ఉంటుందని వ్యాఖ్యలు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వానికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై తాపత్రయం లేదని పట్టింపు లేనితనం కారణంగా రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఏర్పాటుచేసిన రైతు ఆత్మహత్యలపై అధ్యయన కమిటీ ఛైర్మెన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం చనాక-కోర్ట బ్యారేజీ నిర్మించి మెయిన్ కెనాల్ కూడా పూర్తిచేశామని మిగితా పనులు చేపట్టేలోపు ఎన్నికలు వచ్చాయని తెలిపారు. మిగిలిపోయిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రారంభించడం లేదని మండిపడ్డారు. రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేసేందుకు ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయన శనివారం కమిటీ సభ్యులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు విశేషంగా కృషిచేసిందని గుర్తుచేశారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధనీటిని అందించి రోగాల వ్యాప్తిని అరికట్టగలిగామని చెప్పారు. జిల్లాలో అగ్రికల్చర్ కళాశాల ప్రారంభించామని..ఇంజనీరింగ్ కళాశాలను కూడా మంజూరుచేశామని తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో కనీసం పత్తికి కూడా గిట్టుబాటు ధర రాలేదని ఆలస్యంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచారని విమర్శించారు. ముఖ్యంగా రైతుభరోసా అందించడంలో తీవ్ర జాప్యం చేస్తోందని రాష్ట్రంలో 1.50కోట్ల ఎకరాల్లో సాగు భూమి ఉండగా ఇందులో 92లక్షల ఎకరాల్లో ఐదు ఎకరాలలోపు రైతులు ఉన్నారని వివరించారు. 10ఎకరాల వరకు ఓ 6శాతం మంది ఉంటారని చెప్పారు. ప్రభుత్వం కుంటిసాకులు చెప్పి రైతుభరోసా ఇవ్వకుండా ఎగ్గొట్టిందని పేర్కొన్నారు. చనాక- కోర్ట ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో 50వేల ఎకరాలకు సాగునీరందించొచ్చని కానీ ప్రభుత్వం పనులు ప్రారంభించడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై బీజేపీ ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆగిపోయిన పనులను ప్రారంభించడంతో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, మాజీ మంత్రులు జోగు రామన్న, సత్యవతిరాథోడ్, పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే హతమార్చారు: ఏసీపీ



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం గ్రామంలో గురువారం అర్ధ రాత్రి జరిగిన హత్య పథకం ప్రకారమే జరిగిందని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. హత్యకు పాల్పడిన నిందితునితో పాటు సహకరించిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వివరాలను శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్న అవిడపు రాజన్న 7 సంవత్సరాలుగా చెడు తిరుగుడుకు అలవాటు పడ్డాడు. భార్య భాగ్యతో తరచూ గొడవపడుతూ ఉండేవాడు. భార్యతో పాటు కొడుకును కూడా చంపుతానని బెదిరించేవాడు. 10 రోజుల క్రితం భార్య భాగ్యతో గొడపడిన రాజన్న భార్య, కుమారుడిని ఇంటి నుండి వెళ్లగొట్టాడు. ఎప్పుడూ గొడవ పడుతూ చంపుతానని బెదిరిస్తున్న తండ్రి ప్రవర్తనతో విసుగు చెంది కొడుకు సిద్దార్థ ఇద్దరి స్నేహితులతో కలిసి హత్యకు పథకం వేసుకున్నారు. హత్యకు అవసరమైన కత్తిని స్నేహితుడు సందీప్ సమకూర్చగా ముందుగా అనుకున్నట్లుగా గురువారం రాత్రి మృతుని ఇంటికి వచ్చారు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోకి ప్రవేశించారు. కుమారుడు తండ్రిని తోసేయడంతో మంచం మీద పడ్డటంతో ఇద్దరు స్నేహితులు గట్టిగా పట్టుకున్నారు. దీంతో సిద్దార్థ రాజన్న గొంతు కోసి చంపాడు. హత్యకు పాల్పడిన రాజన్న కుమారుడితో పాటు సహకరించిన బాల నేరస్థులు శ్రీరాంపూర్ అరునక్కనగర్‌కు చెందిన సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. చెన్నూర్ సీఐ రవీందర్ పర్యవేక్షణలో కేసును ఛేదించిన ఎస్ఐ శ్రీధర్‌తో పాటు సీఐని ఏసీపీ అభినందించారు.

మధనం గంగాధర్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి



నవతెలంగాణ-మంచిర్యాల

సంచార జాతుల నాయకుడు, విద్యావంతుడు మధనం గంగాధర్‌కు కాంగ్రెస్ పార్టీ నుండి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా టికెట్ ఇచ్చి సంచార జాతి బిడ్డల ఆత్మగౌరవం కాపాడాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల నాయకులు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్య భారత దేశంలో 75 ఏండ్ల రాజ్యాంగ పాలనలో నేటికీ సంచార జాతులకు రాజకీయ అవకాశం లేదని, రాష్ట్ర రాజకీయ పార్టీలు కూడా సంచార జాతులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ జాతులకు రాజకీయ రిజర్వేషన్స్ లేక ఎలాంటి రాజకీయ అవకాశం లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచార జాతి కులాలు బీసీల్లో 52 కులాలు, ఎస్సీల్లో 10 కులాలు, ఎస్టీల్లో 4కులాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కులాల జనాభా పరంగా రాష్ట్ర జనాభాలో బిసి సంచార కులాల జనాభా 12శాతం, ఎస్సీ సంచార కులాల జనాభా 20శాతం, ఎస్టీ సంచార కులాల జనాభా 10శాతం ఉన్నట్టు అధికారిక లెక్కలు ఉన్నాయన్నారు. అయినా పట్టించున్నవారే లేరని, ప్రస్తుతం రాష్ట్రంలో 6 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయని, ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎస్సీ సంచార జాతి బిడ్డ మధనం గంగాధర్‌ను ప్రకటించాలని సంచార జాతుల సంఘం నుండి కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంచార జాతుల కోఆర్డినేటర్ కోనేటి శ్రీనివాస్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంచార జాతుల ఇన్‌చార్జి గండికోట కృష్ణ, గోత్రాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల వేణు, జిల్లాలోని వివిధ కుల సంఘాల అధ్యక్షులు తిరుపతి, క్రాంతి కుమార్, గందేశ్రీ తిరుపతి, రవికుమార్, సారయ్య సాయికుమార్, అశోక్ పాల్గొన్నారు.

హెల్మెట్ భారం కాదు..భద్రత : సీపీ శ్రీనివాసులు



నవతెలంగాణ-మంచిర్యాల

వాహన దారులు హెల్మెట్‌ను భారంగా కాకుండా బాధ్యతగా ధరించాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారు ప్రమాదాలకు గురైనప్పుడు హెల్మెట్ లేకపోతే ఫలితం దారుణంగా ఉంటుందన్నారు. శరీరంలో ఇతర భాగాలకు గాయలైతే సాధ్యమైనంత వరకు చికిత్సతో ప్రాణాలు కాపాడుకోవచ్చని, కానీ తలకు గాయలైతే మెదడు దెబ్బతిని మృతి చెందుతారని తెలిపారు. కొన్నిసార్లు బ్రెయిన్ డెడ్ కావడం లేదా మతిస్థిమితం కోల్పోడం జరుగుతుందన్నారు. మోటారు సైకిల్ ప్రమాదాల్లో 90 శాతం మరణాలు తలకు తీవ్రమైన గాయాలు కావడం వల్లే సంభవిస్తున్నాయని, అందుకే హెల్మెట్ వాడితే ప్రమాద తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం హెల్మెట్ లేని వాహనదారులకు, మున్సిపల్ కార్మికులకు, మహిళలకు ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. అవగాహన కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ఆర్.ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ జాడి నరసింహులు, సీఐలు సత్యనారాయణ, ప్రమోద్‌రావు, ఆకుల అశోక్ పాల్గొన్నారు.

మున్సిపల్ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నిర్మల్‌టౌన్ : మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్, కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో ప్రవేశ పెట్టిన ఏజెండాలోని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పట్టణ మాస్టర్ ప్లాన్ జీవో నెంబర్ 220 రద్దు తీర్మానంతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పోలీస్ పరేడ్‌ను పరిశీలించిన ఎస్పీ

నిర్మల్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల పోలీస్ పరేడ్‌ను ఎస్పీ జానకి షర్మిల శనివారం పరిశీలించారు. మాక్ డ్రిల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. వేడుకలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఇందులో నిర్మల్ డివిజన్ అదనపు ఎస్పీ రాజేష్ మీనా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాంనాథ్, సత్యనారాయణగౌడ్, మెడిసెమ్మే రాజు, మార్కెట్ కమిటీ చైర్మెన్ భీంరెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన బొజ్జ రాజు గత కొద్ది రోజుల కింద ఎడ్లబండిపై నుంచి పడి గాయపడి మంచానికె పరిమతమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి శనివారం బాధితుడిని పరామర్శించి, రూ.11వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పూండ్రు పోతారెడ్డి, పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, భూమన్న, బొజ్జ ప్రవీణ్, సూర్యసేన్, దొంతుల ఇస్తారి, దత్తు, గోక సాగర్‌రెడ్డి, స్వామి రెడ్డి, శివయ్య, నర్సింగ్ ఉన్నారు.



ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి సూచిక

- కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



నిర్మల్‌టౌన్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి సూచిక అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఓటు హక్కు ప్రాముఖ్యతను నాటికల రూపంలో ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను కలెక్టర్, అధికారులు అభినందించారు. సమావేశానికి హాజరైన వారితో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో ఓటు హక్కు అమలైన తీరును విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరూ సమాజంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు పిల్లలందరికీ ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుపాలన్నారు. అనంతరం ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధ ఓటర్లను, ట్రాన్స్ జెండర్, మహిళ, నూతన యువ ఓటర్లను శాలువాతో సన్మానించి, పూల మొక్కలను అందజేసి అభినందించారు. వీరందరూ ఓటర్లందరికి ఆదర్శమని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాలుపంచుకున్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఓ విజయలక్ష్మి, డీఈఓ పి.రామారావు, డిఎంహెచ్ఓ రాజేందర్, సీపీఓ జీవరత్నం, వెనుకబడిన తరగతుల అధికారి శ్రీనివాస్, డివైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, ట్రాన్స్‌జెండర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మొదటగా పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువపై ప్లకార్డులు విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ ఓటు విలువ చాలా గొప్పదని, ఓటు విలువ తెలుసుకొని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు దేశం కోసం మంచిని ఎన్నుకోవాలని అన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ రోహిదాస్, ఎంఈఓ వెంకట్‌రావు, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, మురళి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరాజ్ అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో సంబంధిత బీఎల్‌ఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ జూనియర్ కళాశాల నుంచి తెలంగాణ చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపట్టారు.

సారంగాపూర్ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైందని తహసీల్దార్ శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ కందూరి శంకర్ అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేసి ప్రజలు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో...

మండల కేంద్రంలోని వివేకానంద ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రధాన విధులగుండా ర్యాలీ నిర్వహించి, ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ఓటు హక్కు దాని ప్రాధాన్యతపై క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లిఖిత, ప్రధానోపాధ్యాయులు విమల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురంభీం ప్రాంగణం నుంచి ర్యాలీ ప్రారంభమై ఉట్నూర్‌లోని ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ ర్యాలీలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల విద్యార్థులు అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కే సునీల్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్ఞానేశ్వర్ షిండే, కళాశాల అధ్యాపకులు గంగాధర్, నవీన్ రెడ్డి, ప్రదీప్, అశోక్‌రెడ్డి, వనజ, శ్రీనివాస్, భీమేష్, సుభాష్, రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు నమూనా పోలింగ్ నిర్వహించారు. ఓటింగ్, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. ప్రత్యేక అధికారి వీణ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా నమూనా ఎన్నికల్లో పాల్గొన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు విద్యార్థినులు బారులు తీరారు. నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, కౌంటింగ్ తదితర విషయాల పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నార్నూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠశాలలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు ఆయా పాఠశాలల విద్యార్థులు అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కళాశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకట కేశవులు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.బాలాజీ, వెంకటరమణ, ఉదయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయ సిబ్బంది నిలయ్య, పిడి విశ్వనాథ్, వసంత్‌రావ్, శంకర్, రాజేశ్వర్ ఉన్నారు.

నిర్మల్‌టౌన్ : ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజి కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గుడిపల్లి శ్రావణ్, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యన్నగారి రాజేందర్, సీనియర్ నాయకులు రచన, మల్లేష్ పాల్గొన్నారు.

తాంసి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాలలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాఠశాల కస్తూర్బా గాంధీ వసతి గృహానికి చెందిన విద్యార్థిని విద్యార్థులతో కలిసి గ్రామ వీధులలో బ్యానర్లు పట్టుకొని ఓటు హక్కుపై అవగాహన కల్పించి, గ్రామ కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ తహసీల్దార్ నలంద ప్రియ, తాంసి తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, గోపాలకృష్ణ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, కేజీబీవీ ఎస్ఓ అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఓటు హక్కు నమోదుతో పాటు దాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడ జ్యోతి వెలిగించి జెండా ఊపీ ర్యాలీని ప్రారంభించి, వారితో కలిసి ముందుకు సాగారు. స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జిల్లా పరిషత్ సమావేశ మందిరం వరకు సాగింది. జెడ్పీ హాలులో ఓటు నమోదు, వినియోగంపై అవగాహన కల్పించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ శ్యామలదేవి, శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ సత్కరించి, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతో ఓటింగ్ శాతం కూడా పెరిగిందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఈఓ ప్రణీత, డీపీఆర్ఓ తిరుమల, అధికారులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో....

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఓటరు అవగాహన ర్యాలీ చేపట్టారు. కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నేతాజీచౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఓటరు అవగాహనకు సంబంధించిన నినాదాలు చేస్తూ కొనసాగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెండి బద్రీశ్వర్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, స్వీప్ కోఆర్డినేటర్ ముబారక్, ఎన్ఎస్ఎస్ పీఓలు పృథ్వీరాజ్, యాకూబ్ అలీ, ఎన్సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ చంద్రకాంత్, శ్రీనివాస్, స్వామి, గోపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ కళాశాలలో....

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో నేషనల్ ఓటర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత చేతుల మీదుగా అందజేశారు. ముందుగా. ప్రోగ్రాం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎండీ అష్రఫ్ అలీ విద్యార్థుల చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్ ,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంబి : మండల కేంద్రంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఓటర్లతో పాటు అధికారులు పాల్గొన్నారు. తహసీల్దార్ లక్ష్మణ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై హనుమాండ్లు, ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ విలాస్, ఎంఈఓ సునీల్, ఆయా పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



తలమడుగు



ఆదిలాబాద్‌టౌన్

టోల్‌ప్లాజా కార్మికుల ధర్నాకు సీపీఐ(ఎం) మద్దతు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

గంజాల్ టోల్‌ప్లాజా కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా శనివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. కాగా ఈ ధర్నాకు సీపీఐ(ఎం) నాయకులు కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టోల్ ప్లాజా ప్రారంభమైనప్పటి నుంచి పనిచేస్తున్న కార్మికులకు టోల్ ప్లాజా కాంట్రాక్టర్ మారినప్పుడల్లా తలనొప్పిగా మారిందని, వేతనాలను పెంచాల్సింది పోయి ఇప్పటివరకు ఇచ్చిన వేతనాలు కాకుండా తక్కువ వేతనం ఇస్తానని కాంట్రాక్టర్లు మాట్లాడటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కార్మికులకు ఇప్పటికే ఉన్నటువంటి వేతనాలను 30శాతం పెంచి ఇవ్వాల్సింది పోయి మేము తగ్గిస్తాం అనడం కొత్త కాంట్రాక్టర్లు తమ నియంతృత్వ ధోరణి మార్చుకోవాలన్నారు. పాత వేతనాలను కొనసాగిస్తూ, ఇప్పటికే పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచాలని, ఏ ఒక్క కార్మికుని తొలగించాలని చూసిన కార్మిక వర్గం మీ పోరాటాలకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్ల నర్సయ్య, టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షులు రమేష్, కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, రాజేశ్వర్, గంగాధర్, నవీన్, సహాయ కార్యదర్శి గంగాధర్, రాజ్ కుమార్, శ్రావణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఉడుగు లస్మన్న, ఖోడద్ గ్రామంలో షేర్ల నారాయణ, అదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అమ్మమ్మ మరణించడంతో వారి కుటుంబాలను మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో దేవాపూర్ మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ కో ఆప్షన్‌మెంబర్ బాబుఖాన్, సల్ల దేవన్న, దూస నర్సింలు, బర్ల వెంకన్న, లచ్చన్న, దేవిదాస్, రావుల నారాయణ, నాందేవ్, లంగిడే ఆనంద్ ఉన్నారు.

కోర్టు సిబ్బందికి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేసుల ఒత్తిడిలో ఉండే న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రీడ పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. న్యాయవాదులు, కోర్టు ఉద్యోగుల మధ్య టాస్ వేయగా న్యాయవాదులు బ్యాటింగ్ ఎంచుకున్నారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకోని క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఆకాక్షించారు. అనంతరం న్యాయమూర్తులు బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఉత్సహ పరిచారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఆటలతో ఉద్యోగులు, న్యాయవాదులకు ఉల్లాసంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడాల్లో గెలుపోటములుంటాయని, వాటిని క్రీడ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, దుర్గారాణి, ప్రమీల జైన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ పాల్గొన్నారు.

కల్లుగీత సహకార సంఘం కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కల్లుగీత సహకార సంఘం జిల్లా ఎన్నికలను శనివారం పట్టణంలో నిర్వహించారు. సహకారశాఖ రాష్ట్ర ఎన్నికల అథారిటీ, హైదరాబాద్ ఆదేశాల మేరకు సహకార శాఖ జూనియర్ ఇన్స్‌పెక్టర్ శ్వేత ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కల్లుగీత సహకార సంఘం జిల్లా అధ్యక్షులుగా పి.నర్సగౌడ్, కార్యదర్శిగా ఎ.సురేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.సంజీవ్‌గౌడ్, మేనేజింగ్ కమిటీ సభ్యులు సి.నర్సమ్మ, ఎస్.భగీరథబాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం 2030 వరకు కొనసాగుతుందని సహకార శాఖ జూనియర్ ఇన్స్‌పెక్టర్ శ్వేత తెలిపారు. కల్లుగీత సహకార సంఘం అధ్యక్షులు నర్సాగౌడ్ మాట్లాడుతూ సంఘంలో ఉన్న సభ్యుల సమస్యలు పరిష్కరిస్తానని, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువాతో సన్మానించారు.

నాగోబా ఆలయ కమిటీ చైర్మెన్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్‌లో కొలువుదీరిన నాగోబా ఆలయ కమిటీ చైర్మెన్‌గా మెస్రం ఆనంద్‌రావు శనివారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా నాగోబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైన మెస్రం ఆనంద్ రావుతో పాటు సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. వారిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగోబా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని అన్నారు. నాగోబా మహా జాతరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కలతో పాటు పలువురు మంత్రులు రానున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్మెన్‌తో పాటు సభ్యులు ఆలయాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ రాజ మౌళి, పటేల్ వెంకట్ రావ్, మెస్రం వంశీయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మర్రి చెట్టు వద్ద మెస్రం వంశీయుల బస

- ఎడ్ల బండ్లలో పయనం
- రెండు రోజుల పాటు ఇక్కడే బస
- వెదురు గుల్లలో నైవేద్యం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన కేస్లాపూర్‌లోని నాగోబా జాతర ఈనెల 28న ప్రారంభం కానుంది. నాగోబా మహా జలాభిషేకం కోసం మెస్రం వంశీయులు ఖటోడ హన్మంతు, కోసేరావ్, ధర్ము, ప్రధాన్‌లు మెస్రం తిరుపతి, దాదేరావ్‌ల ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని హస్తినమడుగులోని పవిత్ర గంగాజలంతో ఇంద్రాదేవికి చేరుకున్నారు. అక్కడి నుంచి కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్దకు చేరుకున్నారు.

మూడు రోజుల పాటు బస..

ఈనెల 28న ప్రారంభమయ్యే నాగోబా జాతర వరకు ఈ మర్రి చెట్టు వద్దనే ఉంటూ వివిధ సాంప్రదాయ కార్యక్రమాలు చేపడుతారు. వెదురుతో చేసిన తెల్లటి గుల్లలో నైవేద్యాన్ని సమర్పించడం వీరి ప్రత్యేకత. ఈ మర్రి చెట్టు సన్నిధిలోనే నాగోబా పీఠాధిపతి పటేల్ వెంకట్‌రావ్‌ను నాగోబా పూజలో రావాలని సాదరంగా ఆహ్వానిస్తారు. ఈ సందర్భంగా వారి సాంప్రదాయ వాయిద్యాలైన కాలికొమ్, పెప్రెలను వాయిస్తూ పూజ చేస్తారు.

తూమ్ పూజలు.. (కర్మకాండలు)

పూజకు ఒక రోజు ముందు తమ చనిపోయిన పూర్వీకుల పేరిట తూమ్‌నిర్వహించడం జరుగుతోంది. దీనికి తూమ్ పూజ అంటారు.



మర్రి చెట్టు వద్ద బస చేస్తున్న మెస్రం వంశీయులు



వెదురు గుల్లలో నైవేద్యం

పదిలో వంద ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-బెజ్జూరు



పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏసీఎంఓ ఉద్ధవ్ అన్నారు. శనివారం సలుగుపల్లి, కుంటలమానేపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోనే రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలను అందించారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఇప్పటినుంచే సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉదయం రాత్రి ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగైన విద్యాబోధన అందించాలని ఆదేశించారు. అదే విధంగా పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ అందించాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం ప్రసాద్, పరశురాం ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని సాకడ చౌరస్తాలో ఏ ఎస్సై ఉల్లాస్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, నాటుసారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టేందుకు మండల పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రోడ్డు మార్గాలు, ముఖ్యమైన కూడళ్లలో వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ప్రేమ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఒక్కో గ్రామం ఎంపిక చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు జిల్లాలోని మండలానికి ఒక గ్రామాన్ని చొప్పున ఎంపిక చేసి పథకాల అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వరరావులతో కలిసి మండల స్థాయి అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 4 సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 26వ తేదీన లాంచనంగా ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని 15 మండలాలలో మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి ఆ గ్రామంలోని లబ్ధిదారులకు పథకాలు అందించేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాలలో 100 శాతం అర్హత గల వారికి పథకాలు అందజేయాలని, ఎట్టి పరిస్థితులలో అనర్హుల పేర్లు జాబితాలో ఉండకూడదని, ఈ నెల 26న మధ్యాహ్నం 1 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పథకాలను ప్రారంభిస్తారని తెలిపారు. పథకాల అమలులో భాగంగా ఆయా ఎంపిక చేయబడిన గ్రామాలలో 4 పథకాల లబ్ధిదారులకు మంజూరి పత్రాలు అందజేయాలని తెలిపారు. ప్రజా పాలన గ్రామసభలు అభ్యంతరాలు, నూతనంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిలో అర్హులైన వారికి మంజూరి పత్రాలు అందజేసే విధంగా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అంతకుముందు ఇదే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి సత్యనారాయణ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిబంధనలు ఎత్తివేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.12 వేలకు ఉపాధి హామీకి పెట్టిన నిబంధనలు ఎత్తివేయాలని, భూమి లేని ప్రతి పేదవారికి పథకం వర్తింపజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గోలేటిలో జరిగిన గ్రామ సభలో డీపీఓ భిక్షపతికి విన్నవించారు. అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా భూమిలేని నిరుపేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు మాట మార్చి ఉపాధి హామీకి లింకు పెట్టిందన్నారు. జాబ్ కార్డ్ నిబంధనలను ఎత్తివేసి భూమిలేని నిరుపేదలకు ఈ పథకం వర్తింపజేయాలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు

గ్రామసభలో బీజేపీ నిరసన

గోలేటి గ్రామంలో జరిగిన గ్రామసభలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చేవరకు బీజేపీ వారికి అండగా పోరాడుతుందని జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. గ్రామసభలో గ్రామస్థులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన వారికి పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు

ఘనంగా బొమ్మల కొలువు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి లేడీస్ క్లబ్‌లో బెల్లంపల్లి ఏరియా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.ఉమారాణి శ్రీనివాస్ అధ్యక్షతన బొమ్మల కొలువు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా శారద బలరాం, సునీత వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని బొమ్మల కొలువును పరిశీలించారు. అనంతరం మహిళల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేసిన నృత్యాలు, నాటికలు అలరించాయి. సంస్కృతిని తెలియజేసేల తమ వంతుగా బొమ్మల కొలువు నిర్వహించామని ఉమారాణి తెలిపారు. ఇదిలా ఉంటే ఇందులో పల్లెటూరి వాతావరణం, ఎడ్లబండి ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ పద్మ, జాయింట్ సెక్రెటరీ సౌమ్య, కమిటీ మెంబర్ ప్రియాంక పాల్గొన్నారు.

కుంభమేళా యాత్రికులకు సరుకుల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం నుండి కుంభమేళాకు వెళుతున్న యాత్రికులకు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తినుబండారాలను అందించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వెళుతున్న ఈ యాత్రను కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రతన్‌గైన్, అరుణ్‌కుమార్, రవివర్మ, సమీర్‌గుప్తా పాల్గొన్నారు.

నేటి వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

- సిబ్బందితో ఎస్పీ రిహార్సల్
- రెండు గంటల పాటు సాగనున్న వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించనున్న 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. ప్రతి సంవత్సరంలాగే సందర్శకులు, ప్రముఖుల, విద్యార్థుల గ్యాలరీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

సిబ్బందితో ఎస్పీ రిహార్సల్

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అంజన్నతో కలిసి సిబ్బంది చేసే పరేడ్ పర్యవేక్షించారు. గౌరవ వందనం, పరేడ్ చేసే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పరేడ్ పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రెండు గంటల పాటు సాగనున్న వేడుకలు

జిల్లా కేంద్రాల్లోని పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జాతీయ జెండా ఆవిష్కరించినంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9:10కి మార్చ్ ఫాస్ట్, 9:20కి జిల్లా అభివృద్ధిపై ముఖ్యఅతిథి కలెక్టర్ సందేశం, 9:35కు శకటాల ప్రదర్శన, 9:45కు సాంస్కృతిక కార్యక్రమాలు, 10:10కు ప్రశంసా పత్రాల అందజేత, తర్వాత 10:50కి స్టాల్స్ సందర్శనతో కార్యక్రమం ముగియనుంది.

ప్రభుత్వ ముఖ్య అతిథి లేకుండా వేడుకలు

స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రెండు వేడుకలకు కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా ముఖ్య అతిథిని జిల్లాకు కేటాయిస్తారు. అయితే నేడు జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రభుత్వం తరపున ఎటువంటి ముఖ్యఅతిథిని కేటాయించకపోవడంతో కలెక్టర్ ముఖ్యఅతిథిగా వ్యవహరించనున్నారు. గతంలో ఎన్నికల కోడ్ సమయంలో జరిగిన వేడుకలకు మాత్రమే ముఖ్య అతిథి కేటాయింపు జరగలేదు. కానీ ప్రస్తుతం ఎన్నికలు లేకపోయిన ప్రభుత్వ ప్రతినిధిని కేటాయించకపోవడంపై చర్చ జరుగుతుంది.





మందిర ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఆహ్వాన పత్రికను అందించారు. నియోజకవర్గంలోని కెరమెరి మండలంలోని బోరిలాల్ గూడాలో ఈనెల 31న ప్రారంభించనున్న జగదాంబ దేవి సంత్ తపస్వి జగద్గురు రామారావు సేవాబాయి మందిర ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. కాగా శనివారం ఆలయ నిర్వాణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోవలక్ష్మికి ఆహ్వాన పత్రిక అందజేయడంతో పాటు గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని అప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు పరశురాం, నాందేవ్, బాబూలాల్, ఇందాల్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బాలికలు తమ ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీత రావుజీ సూచించారు. కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా విద్యపై దృష్టి పెట్టగలుగుతారని అన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ నాచగిరి, కార్యదర్శి డాక్టర్ రమాకాంత్, డాక్టర్ రావూజీ, డాక్టర్ భానుప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, సమన్వయకర్త శాంతికుమార్, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, కవిత రాణి, రవూఫ్, కమాలుద్దీన్, ఆనంద్‌బాబు, నాగేందర్‌గౌడ్, విజయలక్ష్మి, నర్మద, మధురాణి, అన్నపూర్ణ, సత్యనారాయణగౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.



క్రీడల నిర్వహణకు ప్రాంగణం సిద్ధం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే క్రీడ పోటీలకు బాలుర పాఠశాల క్రీడ మైదానాన్ని సిద్ధం చేయాలని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల క్రీడామైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం క్రీడ మైదానం క్రీడలకు అనుకూలంగా లేదని దానిని చదును చేయడానికి పూర్వ విద్యార్థులమైన తాము ముందుకు వచ్చినట్లు తెలిపారు. అయితే పాఠశాలపై తనకున్న అనుబంధంతో వ్యక్తిగతంగా మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలో క్రీడాకారులకు మైదానం లేకపోవడం బాదాకరమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని క్రీడ మైదానం సిద్ధం చేశామన్నారు. దీంలో భాగంగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో గత సంవత్సరం నిర్వహించిన మాదిరిగా ఎంపీపీ కప్ పేరుతో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైంది

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. 15వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ నుండి పిల్లల పార్క్, కుమురం భీంచౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించిన టూకే రన్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ముగ్గుల పోటీలో భాగంగా వేసిన ముగ్గులను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తో కలిసి పరిశీలించి జిల్లా అధికారులు, విద్యార్థిని విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకొని దేశ అభివృద్ధికి దోహదపడాలన్నారు. భారత ఎన్నికల సంఘం ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తుందని, అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగిన మనదేశంలో పాలకులను ప్రజలు ఎన్నుకుంటారని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలన్నారు. ముగ్గుల పోటీలో పాల్గొని ఓటు ప్రాధాన్యత తెలియజేసిన మహిళలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ దత్తరావు, ఏపీడీ రామకృష్ణ, డీఎల్పీఓ ఒమర్ హుస్సేన్, ఉద్యోగులు, యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణి : మండలంలో ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ సూర్యప్రకాష్ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులతో తహసీల్దార్ కార్యాలయం నుండి కుమురం భీం చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం భీం చౌరస్తాలో విద్యార్థులతో కలిసి గ్రామస్తులు, అధికారులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, ఎంఈఓ అంజయ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి : దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఆయుధం ఓటు హక్కని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకొని సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ అంజత్ పాషా, విద్యాధికారి ఆడే ప్రకాష్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ ప్రాంతం వరకు నిర్వహించిన ఓటర్ల అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో అధికారులు, విద్యార్థులు పాల్గొని ప్లే కార్డులు చేతబట్టి మన ఓటు మన హక్కు, ఓటు ఈజ్ యువర్ వాయిస్ వంటి నినాదాలతో ఓటు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవీందర్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

దహెగాం : ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ కవిత అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, ఆర్ఐలు శృతి, నాందేవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

చింతలమానేపల్లి : ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులను నిర్దేశించేది ఓటర్లేనని తహసీల్దార్ మునవార్ షరీఫ్, ఎంపీడీఓ కోట ప్రసాద్, ఎంఈఓ జయరాజ్ అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కుమురం భీమ్ చౌరస్తా నుండి చత్రపతి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంతో పాటు వృద్ధులను సత్కరించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో ఎంపీఓ సుధాకర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని తహసీల్దార్ ఆర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలం లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించినంతరం మండల అధికారులు, సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ బాక్కాయ్య, ఎంపీడీఓ సత్యనారాయణ, మండల విద్యాధికారి వేణుగోపాల్, మాజీ వార్డు సభ్యులు ఇఫ్రాత్ హుసేన్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం కళాశాల సిబ్బంది, విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టేమాజీతో పాటు పలువురు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 15వ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఓటు విలువను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, దీనిపై అందరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. అర్హులు ఓటేయ్యాలని సూచించారు. ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ, సింగిల్‌విండో చైర్మన్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.













నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com

ఆరోగ్య పథకాలపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట



ఆరోగ్య కేంద్రం పరిధిలోని సోమగూడెం గ్రామంలో జాతీయ ఆరోగ్య మిషిన్ ఆరోగ్య కార్యక్రమాలపై కళాకారుల బృందంచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు సాధారణ ప్రసవాలు చేయాలని, వందశాతం టీకాలు ఇప్పించాలని, జాతీయ క్షయ కుష్టు నివారణ వివిధ ఆరోగ్య పథకాలు, కార్యక్రమాల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట వైద్యాధికారి డాక్టర్ కిరణ్, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, కళా బృందం రమేశ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ భోజన అవార్డు స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట



జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ భోజన్న ఉత్తమ తహసీల్దార్, ఏఆర్వోగా కలెక్టర్ కుమార్ దీపక్ అవార్డును అందజేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 2024 ఎన్నికల నిర్వహణలో ఉత్తమ విధులు నిర్వహించినందుకు గాను ఎన్నికల సంఘం నుంచి అవార్డును అందుకున్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 15వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌లతో కలిసి పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వీడియో ద్వారా భారత ఎన్నికల సంఘం కమీషనర్ రాజీవ్ కుమార్ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1950 జనవరి 25వ తేదీన ఎన్నికల సంఘం స్థాపించబడిందని, ప్రపంచంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉందని అన్నారు. 18-19 సంవత్సరాలు నిండిన యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు తమ ఓటు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఒక్క ఓటుతో గెలుపు, ఓటములు తారుమారవుతాయన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగిన భారతదేశంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియను విదేశాలు ఆదర్శంగా తీసుకోవడం గర్వకానమని అన్నారు. యువ ఓటర్లు తమ స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఖచ్చితంగా ఓటు వేసేలా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని "ఓటును మించి ఏమీ లేదు-నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను" అనే నినాదంతో అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు వృద్ధులు, యువ ఓటర్లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాశాలల, పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ, ఏపీఓ నవీన్ కుమార్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జైపూర్ : భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు పట్ల ప్రతి ఒక్కరికి అవగాహణ అవసరమని భీమారం తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ మదుసూధన్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి, ఏపీఓ జీనత్, స్థానిక పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శనివారం ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతిబాపురావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయ్, ఉపాధ్యాయులు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఇందారం పాఠశాలలో ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమాదేవి, గోపగాని రవీందర్, రమేష్ బాబు, సత్తిరెడ్డి, మంజుల, సంధ్యారాణి, జనార్ధన్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల) పాఠశాల, కళాశాలలో శనివారం ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఓటు యొక్క ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే వ్యాసరచన పోటీ, ఓటు ప్రాముఖ్యత గురించి పాటలు, డాన్సులు. క్విజ్ పోటీలు. భారత ఎన్నికల సంఘం ప్రాముఖ్యత, ఫామ్-8, ఫామ్-6, పత్రాల ప్రాముఖ్యత, విద్యార్థినిలతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. రమా కళ్యాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కె శ్రీలత పాల్గొన్నారు.

జన్నారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు దాటిన వారు ఓటరుగా పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి బి.కరుణాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూర్ : ప్రతి ఒక్క పౌరుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ స్టేడియం నుంచి బజార్ ఏరియా మీదుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఓటు హక్కు ప్రధానమైనదని 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం జనవరి ఏప్రిల్ జూలై అక్టోబర్ మాసాలలో ప్రభుత్వం ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి తహసీల్దార్ జోత్స్న, ఆర్ఐ మురళీధర్ రావు పాల్గొన్నారు.

తాండూరు మండల కేంద్రంలో..

తాండూరు మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యా భారతి, కేజీబీవీ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ ఎంఈఓ మల్లేశం కేజీబీవీఎస్ఓ కవిత విద్యాభారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ శరత్ కుమార్ కాంగ్రెస్ నాయకులు సూరం రవీందర్ , ఈసా , శంకర్ స్థానిక నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.



జైపూర్‌లో..



లక్షెట్టిపేటలో..



కాసిపేటలో..



తాండూర్‌లో..

బాదంపల్లిలో అగ్నిప్రమాదం

- రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బాదంపల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఆ గ్రామానికి చెందిన జాడీ సురేశ్ ఇంట్లో ఉన్న పూజ గదిలో దీపం మంటలు వ్యాపించడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో మండల ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. మంటలను పూర్తిగా అర్పివేసి నట్లు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. బాధితులు ఇంట్లో ఉన్న వంట సామాను, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదు కూడా కాలిపోయిందని అధికారులు తెలిపారు. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వచ్చి ఉంటుందని స్థానిక తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి, ఆఐ భానుచందర్ పంచనామా చేసి వివరాలు వెల్లడించారు. తమను ప్రభుత్వం, ఆదుకోవాలని బాధితుడు జాడి సురేష్ అధికారులను కోరారు.

మున్సిపల్ పాలకవర్గానికి ఘన సన్మానం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట మున్సిపల్ పాలకవర్గ గడువు ముగియడంతో శనివారం మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్పర్సన్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ చల్ల నాగభూషణం, పాలకవర్గ సభ్యుల సన్మానించారు. కార్యక్రమములో కార్యాలయ మేనేజర్ టీ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

సంచార జాతుల సంఘం మంచిర్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు హోల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్‌గా జన్నారంకి చెందిన గండికోట కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడిగా తాళ్ల వేణు జిల్లా అధ్యక్షుడిగా మద్దివేణి అర్జున్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల సమ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవికుమార్, కోశాధికారిగా పురాణం క్రాంతి కుమార్, ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్, చిందం సాయికుమార్, రాథోడ్ భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక రాష్ట్ర అధ్యక్షుడు తిపిరిశెట్టి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కోనేటి శ్రీనివాస్, ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.

సింగరేణి ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిలో ఉత్తమ ఉద్యోగులకు గని మేనేజర్ లక్ష్మీ నారాయణ ప్రోత్సాహక బహుమతులు అందించారు. గనిలో ఉత్పత్తిని పెంపొందించడానికి ఉద్యోగులలో ఉత్సాహాన్ని పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టి అత్యుత్తమంగా పని చేసిన 9 మంది ఉద్యోగులను గుర్తించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఫార్ట్ ఫైరర్ అజయ్, కోల్ కటర్స్ ఓదెలు, శంకర్, భాస్కర్, మహేష్, ఎస్ఎల్ ఆపరేటర్ లక్ష్మీనారాయణ, ట్రామర్ సదానందం, హాలేజ్ ఆపరేటర్ సుభాన్, జనరల్ మజ్దూర్ మొగిళిలకు గని మేనేజర్ బహుమతులను అందించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ గుర్తింపు, ప్రోత్సాహం ఉద్యోగులను మరింత కృషి చేయడానికి ప్రేరేపిస్తూ, ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని గని మేనేజర్ లక్ష్మీ నారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని నర్సాపూర్ సబ్ సెంటర్ పరిధిలో గల అబ్బాపూర్ నర్సాపూర్ మాదారం 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కిశోర బాలికలకు గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణీలు బాలింతలు అధిక పోషక విలువలు ఉన్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. సులువుగా జీర్ణమయ్యే ఆకుకూరలు పండ్లు పప్పు ధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలని తెలిపారు. సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా కోడిగుడ్లు పాలతో పాటు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. బ్దిదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, తిరుమలేశ్వరి, జమున, లక్ష్మితో పాటు ఏఎన్ఎంలు పారిజాతం, స్రవంతి, పల్లె దావకాన వైద్యులు దౌలత్ పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలను ఎస్సీ-డీ కేటగిరిలో చేర్చాలి



నవతెలంగాణ-జన్నారం

బేడ బుడగ జంగాలను ఎస్సీ-డీ కేటగిరీలో చేర్చాలని బేడ బుడగ జంగాల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని ఫోన్కాల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో ఇటీవలే మరణించిన గడ్డం రాజు కుటుంబానికి రూ.5000 నగదు 50కిలోల బియ్యాన్ని అందించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ కేటగిరీలో ఉన్న బేడ బుడగజంగాలు విద్య పరంగా ఆర్థికపరంగా కడు దయనీయ స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం బేడ బుడగ జంగాలకు ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా బేడ బుడగ జంగాలను ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి పరచాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు బేడ బుడగ జంగాలు అనుకూలం అన్నారు. వర్గీకరణ జరిగితే తమను డి గ్రూప్‌లో చేర్చి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వం అధికారులను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బేడ బుడగ సంఘాల నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం గంగాధర్, ప్రధాన కార్యదర్శి మధు, మండల అధ్యక్షుడు గడ్డం రవి, ఈర్నాల గంగన్న, నాయక్, శంకర్, రాజన్న, మల్లయ్య పాల్గొన్నారు.

దళితునిపై దాడి చేసినవారిని శిక్షించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



దళితునిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం, సీపీఐ పార్టీ మండల అధ్యక్షులు ముల్కల రాందాస్, మేదరి దేవవరంలు తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బాధితునితో కలిసి మాట్లాడారు. బాధితుడు అవునూరి రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని రంగపేట గ్రామ శివారులో తన పొలంలో మిల్కూరి మల్లేష్ అనే వ్యక్తి సుమారు తన 20 మంది అనుచరులతో వచ్చి ట్రాక్టర్‌తో దౌర్జన్యంగా పంటను ధ్వంసం చేశాడన్నారు. తన పొలంలోని నాటు వేసిన పంటను ఎందుకు ధ్వంసం చేస్తున్నారని ప్రశ్నించగా, ఇదినా పొలం అని, మాదిగ నా కొడుకా అంటూ కులం పేరుతో దూషించాడన్నారు. అంతేకాకుండా తనపై దాడి చేసి గాయపర్చినట్లు విలేకరుల ముందు దెబ్బలను చూపిస్తూ రోదించాడు. తనను కుటుంబాన్ని చంపుతామని బెదిరించినట్లు వివరించాడు. తనకు పోలీసులు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం, సీపీఐ నాయకులు మాట్లాడుతూ మండలంలోని రంగపేటతో పాటు పలు గ్రామాల్లో దళితుల భూములను లాక్కొని దాడులు చేయడం ఎంత వరకు న్యాయమన్నారు. బడుగు బలహీన వర్గాలతో కొందరు ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ భూములు లాకుంటున్నారని మండిపడ్డారు. దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి భైరం రవి, ఉపాధ్యక్షుడు ప్రేమ్ సాగర్, నాయకులు పెండెం సత్తయ్య, తోట మల్లేష్, రమేష్, కాంతయ్య, నర్సయ్య, యేసన్న, దిలీప్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడి ఎన్నిక



నవతెలంగాణ-కాసిపేట

మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన అట్టెపల్లి శ్రీనివాస్ పటేల్ తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అనుబంధ మున్నూరు కాపు సంఘం నుంచి అధికారికంగా శనివారం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చెట్ల సత్యనారాయణ పటేల్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారికంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్న, పటేల్ చేతుల మీదుగా అట్టెపెల్లి శ్రీనివాస్ పటేల్‌కు నియామక పత్రాన్ని అందించారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పటేల్ కు సన్మానం చేశారు. అనంతరం కాసిపేట మండల అధ్యక్షులుగా ఎన్నికైన అట్టెపల్లి శ్రీనివాస్ పటేల్‌ను జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఐక్యంగా ఉంటూ మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు చిట్ల సత్యనారాయణ పటేల్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్న పటేల్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గి సత్తయ్య పటేల్, మాజీ అధ్యక్షుడు సిద్ధం బాపు పటేల్, మాజీ గౌరవ అధ్యక్షుడు మడిపల్లి తిరుపతి పటేల్, మాజీ ప్రధాన కార్యదర్శి కొమ్ము సతీష్ పటేల్, కాసిపేట మండల మున్నూరుకాపు సంఘం ఎన్నికల కమిటీ సభ్యులు ఇంగు నారాయణ పటేల్, సిద్ధం తిరుపతి పటేల్, అగ్గు శ్రీనివాస్ పటేల్, సీపెల్లి ప్రవీణ్ పటేల్, నామ స్వామిరాజు పటేల్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ(ఎంజేపీ) సాధారణ సంక్షేమ గురుకులల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాలకు నిర్వహించే టీజీ సెట్ 2025ను ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. కాగా ఈ ఏడాది కొన్ని మార్పులు చేసింది. డిసెంబర్ 21 నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా 2025 ఫిబ్రవరి 1వ తేదీ చివరి గడువుగా ప్రకటించింది. వీటితోపాటు 6,7, 8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఫిబ్రవరి 23వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అంతర్జాలంలో టీజీ సెట్, సీజీజీ, జీఓవీ ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఆధార్ కార్డు చరవాణి సంఖ్య ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కానీ ఈ ఏడాది నుండి ఆధార్,బోనఫైడ్, ఫోటోతో పాటు కుల, ఆదాయ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. 040-23391598, 94910 63511,040-23328266,040-24734899 నెంబర్లలో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు. విద్యార్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్, కుల, ఆదాయ, జనన ధ్రువపత్రాలు. నాలుగో తరగతి చదువుతున్న పాఠశాల నుండి బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

అవార్డులు అందుకోనున్న ఎస్టీపీపీ ఉద్యోగులు

జైపూర్ : గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సింగరేణి యాజమాన్యం ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం ఆనవాయితీగా వస్తోంది. అదే క్రమంలో జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ద్వార గుర్తింపు పొందిన ఉత్తమ ఉద్యోగులను ఎంపికచేసి ఆదివారం నిర్వహించే వేడుకల్లో అంర్డులు అందజేయనున్నారు. ఎస్టీపీపీకి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(పర్చేస్ డిపార్ట్‌మెంట్) అరుణ్ ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారు. అదేవిధంగా అజ్మీరా మోహన్(కెమిస్ట్) ఉత్తమ సింగరేణియన్‌గా గుర్తించింది. సింగరేణి సీఎండీ బలరామ్ చేతుల మీదుగా అవార్డులు అందించనున్నారు. అదేవిధంగా సీనియర్ స్టాఫ్ నర్స్ రాజమణితో పాటు జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్ష్ డిపార్ట్‌మెంట్) వెంకటస్వామిని గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అవార్డులు ప్రదానం చేయడంతో పాటు సన్మానించనున్నారు.









రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర సరిహద్దులోని పాత అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద ఎంవీఐ మోహన్ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధన పాటించడంతో పాటు వాహనాలకు అన్ని రకాల పత్రాలు ఉంచుకోవాలన్నారు. జాతీయ రహదారిపై నిర్ణీత నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని రాంగ్ రూట్‌లో వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ రాజమల్లు, కానిస్టేబుల్ రవి పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు

నవ తెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాంలో నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీ.రవి తెలిపారు. మండలంలోని ఈజ్‌గాం గ్రామంలో నాటుసారా తయారీదారులకు బెల్లం, పటిక సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 60కిలోల బెల్లం, 5కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు పి.లోభానంద్, ఐ.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌ఓగా కొనగంటి స్రవంతి



నవతెలంగాణ-కెరమెరి

ఓటర్ల జాబితాలో నమోదు, మార్పులు చేర్పులు, విధుల్లో అత్యుత్తమ సేవలందించిన మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కోగంటి స్రవంతి ఉత్తమ బీఎల్‌ఓ(బూత్ లెవెల్ ఆఫీసర్) బెస్ట్ ఎలక్టోరల్ అవార్డుకు ఎంపికయ్యారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉత్తమ బీఎల్‌ఓ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు. స్రవంతి మండల కేంద్రంలోని ఉదానగర్ (అంగన్‌వాడీ-3)లో విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల విధుల నిర్వ హణలో అత్యుత్తమ సేవలందించినందు ఈ పురస్కారం అందుకోవడం గర్వాంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు అభినందించారు.

బెల్లంపల్లి ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే..

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా లో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్టు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ సింగరేణియన్ ఆదునూరి సుధాకర్(వెల్డర్, ఖైరిగూడ ఓసీ), బెస్ట్ అధికారిగా బి.వీరన్న (ప్రాజెక్ట్ ఇంజినీర్), దూలం సదయ్య(ఈపీ ఆపరేటర్), పర్చికి ధనలక్ష్మి(జనరల్ మజ్దూర్) బెస్ట్ సింగరేణియన్, బెస్ట్ అధికారిణులకు 26న కొత్తగూడెంలో జరిగే గణతంత్ర దినోత్సవ ప్రధాన వేడుకల్లో సన్మానిస్తారన్నారు. బెల్లంపల్లి ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులను గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో జరిగే వేడుకల్లో సన్మానించి, జ్ఞాపికలను అందజేయనున్నట్టు పేర్కొన్నారు..

బాల్య వివాహాల నివారణకు కలిసి రావాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాల్య వివాహాల నివారణకు తమతో ప్రతి ఒక్కరు కలిసి రావాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ అన్నారు. బాలల రక్షణకు సంబంధించి షూర్ ఎన్జీఓ సంస్థ రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సంరక్షణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. బాల్య వివాహాలు నివారించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇదే సందర్భంలో ప్రజలు తమతో కలిసి రావాలని కోరారు. ఎక్కడైనా బాల్యవివాహాలు, బాల కార్మికులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలలఅక్రమ రవాణాపై షూర్ ఎన్జీఓ చేస్తున్న కృషిని అభినందించారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయడానికి ఎన్జీఓ సహకారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-రెబ్బెన

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం గోలేటిలోని శ్రీ భీమన్న మైదానాన్ని ఆయన సందర్శించారు. మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు బాగుండాలన్నారు. మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు, పిరమిడ్ నిర్వహించే వేదిక ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. అతిథులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, యూనియన్ ప్రతినిధులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయనతో పాటు డీజీఎం సెక్యూరిటీ ఎస్.ఉమాకాంత్, సివిల్ (ఈఈ) రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

వాంకిడి : 76వ గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ రియాజ్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫిబ్రవరి 16న స్థానిక సరస్వతి శిశు మందిర్ నిర్వహించే పూర్వ విద్యార్థుల మహా సంబరణాన్ని విజయవంతం చేయాలని సరస్వతి శిశు మందిర్ దక్షిణ మధ్య ప్రముఖ్ సూర్యనారాయణ తెలిపారు. ఏర్పాట్లపై నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశుమందిర్ ప్రారంభం నుండి ఇప్పటివరకు విద్య అభ్యసించిన ప్రతి ఒక్కరు మహా సమ్మేళనంలో భాగస్వాములయ్యే విధంగా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో విద్యార్థులు హాజరై విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల విభాగ్ పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షులు అశోక్ కుమార్, సత్యనారాయణ, విభాగ్ అకడమిక్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, శైలేష్, పోలంపల్లి రాజశేఖర్, సంతోష్, ప్రశాంత్, రాహుల్, వంశి, సతీష్, వేణుగోపాల్, శ్రీనివాస్, సాయిగ్యాన్, కపాల్, నరేష్, శ్రీరాం సత్యనారాయణ, ప్రధానాచార్యులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వరిని వెంటాడుతున్న మొగి పురుగు

- ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా కానరాని ఫలితం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు





నవతెలంగాణ-లోకేశ్వరం

ఆరుగాలం కష్టించిన అన్నదాతకు కన్నీరే మిగిలేలా ఉంది. వాతావరణంలో సంభవించే పలు మార్పుల కారణంగా వరి పైరుకు మొగి పురుగు భారంగా మారింది. మొగి పురుగు నివారించడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డిసెంబర్, జనవరి మొదటి వారంలో నాట్లు వేసిన పొలాలపై ఎక్కువ ప్రభావం చూపుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఒక పక్క జింక్ లోపం, సల్ఫైడ్ దుష్ప్రభావం కూడా కనిపిస్తుంది. ఫలితంగా పొలాలను వదిలేసే పరిస్థితి వస్తోందంటున్నారు. గత యాసంగి, వానాకాలం సీజన్‌లోనూ ఇలానే ప్రభావం పడి దిగుబడులు తగ్గగా, ఈసారి అలాంటి పరిస్థితే కనిపిస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చాల చోట్ల వరికి మొగి పురుగు సోకడంతో రైతులను కలవర పెడుతుంది. మండలంలోని రాజుర, గడ్చుందా, భాగపూర్, మన్మథ్, జోహార్‌పూర్, అబ్దుల్లాపూర్ తదితర గ్రామాలలో మొగి పురుగు బెడద ఉధృతంగా ఉందని పలువులు రైతులు చెబుతున్నారు.

నాట్లు వేసిన 20 రోజుల్లోనే ఆశిస్తున్న తెగుళ్లు...

వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో వరి నారు దశలోనే మొగి పురుగు సోకుతుండగా రెండు, మూడు సార్లు క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. గతంలోనైతే వరిపంట వేశాక పొట్ట దశ నుంచి మొగి పురుగు ఆశించగా ఇప్పుడేమో పది రోజుల నుంచే సోకి వరికర్రలు కుళ్లిపోయి చనిపోతున్నాయి. దీంతో పొలమంతా పంట సాగు చేయని విధంగా ఖాళీ అవుతోంది. పంట కాలపరిమితి 120 రోజుల నుంచి 135 రోజుల వరకు ఉండగా చేతికి అందేసరికి పెట్టుబడుల భారం పెరగనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అవగాహన కల్పించి నష్టాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

తెగుళ్లపై అవగాహన కల్పిస్తాం

గిరిరాజ్, ఏఓ

వరి పంటల్లో ఆశించే చీడపీడలపై రైతులకు అగాహన కల్పిస్తున్నాం. రైతులు కూడా పంటలపై శ్రద్ధ వహించేలా కృషి చేస్తున్నాం. తెగుళ్ల రాకుండా ముందుగా నాటు వేసిన 15 నుంచి 20 రోజుల్లో కార్బాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం పిచికారీ చేయాలి. దానికి తోడు గంట గుళికలు చల్లుకొవాలి.

20రోజుల్లోనే మొగి పురుగు సోకింది..



తోట భాస్కర్, రైతు,రాజుర

ఐదు ఎకరాల్లో వరి పంట వేసి, 20 రోజులు కాకముందే మొగి పురుగు సోకింది. అధికారుల సూచన మేరకు ఎకరాకు 8కిలోల చొప్పున కార్బోఫ్యూరిడాన్ గుళికలు చల్లాను. పురుగుమందు కూడా పిచికారీ చేశాను. తెగుళ్ల ధాటికి పెట్టుబడులు ఎక్కువ అవుతుండగా పంట దిగుబడి తగ్గి నష్టాలే మిగలనున్నాయి. తేడాది వర్షాకాలం పంట కూడా ఆశాజనకంగా రాలేదు.

ఖైదీలకు కాదు..నేరాలకు వ్యతిరేకం

- జిల్లా జడ్జి ఎంవీ రమేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు తాము వ్యతిరేకం కాదని నేరాలకు వ్యతిరేకమని జిల్లా జడ్జి ఎంవీ.రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రాల్లోని సబ్ జైలులో ఖైదీలకు మూడు రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేషంలో నేరాలు చేసి ఖైదీలుగా మారుతున్నారని తాము ఖైదీలకు వ్యతిరేకం కాదని నేరాలకు మాత్రమే వ్యతిరేకమన్నారు. మంచి పనులపై మనసు కేంద్రీకృతం చేసే విధంగా ధ్యానం చేయాలన్నారు. ఎదుటి వ్యక్తిలో మంచిని చూసినప్పుడే సమాజం సుఖశాంతులతో ఉంటుందని తెలిపారు. ఖైదీలుగా జైలులో ప్రవర్తనను మార్చుకొని ఉన్నతమైన నడవడికతో బయటికి వెళ్లాలన్నారు. మూడు రోజుల పాటు ప్రవర్తన మార్పుకు సంబంధించిన నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిర్పూర్-టి జడ్జి అజయ్ ఉల్లాల్, జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్, బ్రహ్మకుమారి సారిక, అడ్వకేట్లు రాజీవ్ రెడ్డి, చరణ్, సఖి సెంటర్ సలహాదారు రమేష్, పారా లీగల్ వాలంటరీ జయరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం బీజేపీ ఎస్సీ మోర్చా పిలుపు మేరకు కాగజ్‌నగర్ పట్టణంలో సంవిధన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక రాజీవ్ చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, నాయకులు ధోని శ్రీశైలం, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, చన్నపురి గణపతి, ముత్తు అశోక్, అరుణ్‌లోయ, సమీర్ గుప్తా, చిప్పకుర్తి శ్రీనివాస్, పారెపల్లి రాణి, వలపదాసు శ్రీదేవి, పుల్ల అశోక్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో సంవిధన్ గౌరవ్ అభియాన్ ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎంపీపీ మల్లికార్జున్ నేతృత్వంలో పాలాభిషేకం చేసి అనంతరం మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. భారత దేశానికి సర్వోత్కృష్ట చట్టం భారత రాజ్యాంగం ద్వారా భారత దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చిందన్నారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల ఏర్పాటు, ఆయా వ్యవస్థల అధికారాలు, బాధ్యతలు, వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో కూడా నిర్దేశిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంటయ్య, మోతే జాన్, నితిన్, అజయ్, కిరణ్, రాకేష్, చంద్ర, ఆదిత్య అభిలాష్, సాయి పాల్గొన్నారు.

రెబ్బెన : మండలం గోలేటి గ్రామంలో సంవిధన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నీళ్లతో శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ నిర్మాణం ఎలా ఉండాలి, పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలను రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ అందించారని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వై.కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు గుల్భం చక్రపాణి మండల అధ్యక్షులు మల్రాజ్ రాంబాబు, నాయకులు గోలెం తిరుపతి, చేపూరి నవీన్ గౌడ్, పోలింగ్ బూత్ అధ్యక్షులు ఎర్ర రాజేష్, శనిగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నవతెలంగాణ-కుభీర్

మూడు సంవత్సరాలుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రోడ్డెక్కారు. శనివారం మండలంలోని తెలంగాణ పీజీ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివేకానంద, తపస్వి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ కళాశాల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, ప్రిన్సిపాల్ సట్ల రవి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక అధ్యాపకులకు వేతనలు ఇవ్వలేక, భవనల అద్దెలు కట్టలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని కోరారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దత్తత్రి, సాయన్న, రాములు, శ్రీనివాస్, లక్ష్మణ్, పోశెట్టి, యోగేష్, మౌనిక, శ్రీకాంత్, దత్తు, విలాస్, రాజు, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



దోషులకు శిక్ష పడేలా చూడాలి

- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్ టౌన్

అవసరమైన న్యాయ నిపుణుల సలహాలతో దోషులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. పోలీస్ కార్యాలయం శనివారం నిర్మల్ జిల్లా సబ్ డివిజన్‌లోని కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రస్తుతం కోర్టులో పెండింగ్ ఉన్న కేసుల వివరాలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు సూచించారు. ప్రాసిక్యూషన్ అధికారుల సహాయ సహకారలు తీసుకుంటూ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులలో తొందరగా ఛార్జ్ షీట్లను కోర్టులో జమ చేసి తొందరగా కోర్టులో కేసు విచారణ కొనసాగేలా చూడాలన్నారు. ఒక్క దోషి కూడా తప్పించుకోకుండా సాక్షులను ప్రవేశపెట్టాలని, ఇందుకోసం ప్రాసిక్యూషన్ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమానికి భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ జిల్లా ఏఎస్పీ రాజేష్ మీన, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా శ్రీనివాస్ పటేల్ నియామకపత్రం స్వీకరణ



నవతెలంగాణ - కాసిపేట

మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన అట్టెపల్లి శ్రీనివాస్ పటేల్ తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహా సభ అనుబంధ మున్నూరు కాపు సంఘం నుంచి అధికారికంగా శనివారం జిల్లా అధ్యక్షులు చెట్ల సత్యనారాయణ పటేల్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారికంగా సంఘం జిల్లా అధ్యక్షులు చిట్ల సత్యనారాయణ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్న పటేల్ చేతుల మీదుగా అట్టపెల్లి శ్రీనివాస్ పటేల్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మండల అధ్యక్షులుగా ఎన్నికైన అట్టెపల్లి శ్రీనివాస్‌ను జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్న పటేల్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు అగ్గి సత్తయ్య పటేల్, మాజీ అధ్యక్షులు సిద్ధం బాపు పటేల్, మాజీ గౌరవ అధ్యక్షులు మడిపల్లి తిరుపతి పటేల్, మాజీ ప్రధాన కార్యదర్శి కొమ్ము సతీష్ పటేల్, మండల నాయకులు ఇంగు నారాయణ పటేల్, సిద్ధం తిరుపతి పటేల్, అగ్గు శ్రీనివాస్ పటేల్, సీపెల్లి ప్రవీణ్ పటేల్, నామసామి రాజు పటేల్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నిగిని గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుంటీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నిగిని గ్రామానికి చెందిన రాథోడ్ అర్జున్(37) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం పురుగులమందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోపే మరణించాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కన్గుట్ట గ్రామానికి చెందిన గడ్డల నారాయణ తాను చిన్న తనంలో చదివిన తన గ్రామంలోని పాఠశాలలో పూర్వ విద్యార్థిగా పిల్లలకు మైక్ సెట్ విరాళంగా అందించి ఉదారత చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్గుట్ట పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిగా ఇక్కడ పిల్లలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన పాఠశాల అభివృద్ధి కోసం సాయం చేయడానికి తను ఎల్లవేళలా ముందుంటానన్నారు. పిల్లలకు అన్ని రకాల వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలనీ కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సీనియర్ నాయకులు ఇదాపు నారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు పోశెట్టి, వీడీసీ చైర్మన్ నవ్వ రవీందర్, ఉపాధ్యాయులు మహేష్, జీవీ రమణ, వీడీసీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతరలో వసతులు కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్‌లో ఫిబ్రవరి 11, 12, 13 తేదీలలో శ్రీ బాలాజి వెంకటేశ్వర స్వామి సన్నిదిలో జరిగే గంగాపూర్ జాతరకు వసతులు కల్పించాలని అలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం బెల్లంపల్లి జీఎంకు అలయ కమిటీ చైర్మెన్ లెండుగురే జయరాం వినతిపత్రం అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, సీనియర్ నాయకులు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, ఐఎన్టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాష్ రావు, గోలేటి పట్టణ అధ్యక్షుడు లావుడీయ పల్లాస్, మాజీ సర్పంచ్ లెండుగురే గంటుమేర, మాజీ ఎంపీటీసీ పెసరీ మాధునయ్య పాల్గొన్నారు

అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-సిరికొండ

అక్రమంగా నిల్వ ఉన్న మద్యాన్ని పట్టుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శివరాం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి మద్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని జాదవ్‌శ్రీ దగ్గర దాదాపుగా రూ.3520 విలువ గల మద్యం బాటిళ్లు, పటిక, బెల్లం పట్టుకున్నట్లు ఎస్సై శివరాం తెలిపారు. అక్రమంగా మద్యాన్ని ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు పరేడ్ ముస్తాబు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరణ నిర్వహించనున్నారు. అయితే ఇక్కడ ఏర్పాట్లు చేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ రాజర్షి షా జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఎక్కడ తప్పులు దొర్లకుండా సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. ప్రభుత్వం 26వ జనవరి నుంచే కొత్త నాలుగు పథకాలను అమలు చేయనున్న నేపథ్యంలో లబ్దిదారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటల ప్రదర్శన, అవార్డుల ప్రదానం వాటికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎక్కడ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

దాతల సహకారంతోనే పాఠశాలలు అభివృద్ధి

నవతెలంగాణ-సారంగాపూర్

దాతల సహకారంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ అన్నారు. మండలంలోని జామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సౌండ్ సిస్టమ్ అవసరం ఉందన్న విషయాన్ని కౌట్ల(బి) గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి, రూ.15వేల మైక్ సెట్‌ను శనివారం పాఠశాలకు అందజేశారు. గతంలో సైతం బ్యాండ్, విద్యార్థులకు రూ.10వేల బహుమతులను అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాల సౌకర్యార్థం వివిధ వస్తువులను అందజేసిన దాత కరుణాకరరెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కార్ప విలాస్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయాన్ని సాధించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

రాబోయే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని డీఈఓ రామారావు అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంలోని కస్బ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులను ఉద్యేశించి డీఈఓ ప్రతిజ్ఞ చేయించారు. ఓటు ప్రాధాన్యతపై వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను ఉద్యేశించి వారు మాట్లాడారు. రాబోయే పదో తరగతి ఫైనల్ పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని, ఈ సంవత్సరం కూడా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించాలని హ్యాట్రిక్‌ను నిర్మల్ జిల్లా సాధించాలని కోరారు. విద్యార్థిని, విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, అర్బన్ ఎంఈఓ నాగేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండీ డాక్టర్ల జాతీయ సదస్సులో జిల్లా వైద్యులు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కలకత్తాలో ఈనెల 23 నుంచి జరుగుతున్న ఎండీ డాక్టర్ల జాతీయ సదస్సులో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దామెర రాములు, చింతపండు రవికుమార్ పాల్గొన్నారు. ఈ సదస్సులో జాతీయ అంతర్జాతీయ వైద్యశాస్త్రజ్ఞులు పాల్గొని, తమ పరిశోధనా పత్రాలు సమర్పించారని, కొత్త కొత్త వైద్య విధానాల గురించి, వైద్యరంగంలో జరుగుతున్న మార్పుల గురించి విస్తృతంగా చర్చించడం జరిగిందని తెలిపారు.

రోడ్డు భద్రత పై అవగహన సదస్సు

నవతెలంగాణ-కుబీర్

మండల పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రోడ్డు భద్రత పై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవీందర్ గ్రామంలో ఉన్న వివేకానంద విగ్రహం నుంచి గ్రామంలో ప్రధాన రోడ్డు వైపుగా ద్విచక్ర వాహనం ద్వారా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆర్డిఓ కార్యాలయం నుండి ధర్మసాగర్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహం వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ విద్యార్థుల ర్యాలీ కొనసాగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని, విద్యార్థులందరూ తమకు ఓటు హక్కు వయసు రాగానే పేర్లు నమోదు చేసుకొని తప్పకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం మరింత పెరగాలన్నారు. విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి వారందరూ ఓటు వేసేలా చూడాలన్నారు. అధికారులు ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి అన్ని ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డిఓ విజయలక్ష్మి, డిఈఓ పి.రామారావు, తహసీల్దార్లు రాజు, సంతోష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



నిర్మల్‌రూరల్ : నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బస్టాండ్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి మతం, కులం, జాతి, భాష లాంటి తేడాలు లేకుండా ఎలాంటి ఒత్తిడిలకు లోను కాకుండా ఓటు వేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, గంగామణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుపై మేము సైతం ఓటర్లను చైతన్యం చేస్తామని అవంతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్లకార్డులతో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు కమల్ కిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులను నిర్దేశించేది ఓటరే అన్నారు. అభివృద్ధి వైపు పయనించాలన్న సరైన పాలకులను ఎన్నుకోవాలన్న ఓటరు చేతిలోనే ఉందన్నారు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఓటరు ఓటు హక్కు వినించుకుంటే దేశ భవిష్యత్తును నిర్దేశించే అస్త్రం అవుతుందని పేర్కొన్నారు. కుల, మత, ధనిక, పేద తేడాలేకుండా అందరికి సమానంగా రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు మాత్రమే అని అన్నారు. రాజకీయాల్లోకి యువత అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్, సంతోష్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో పిల్లలను చేర్పించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రయివేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలతో కూడిన విద్యా బోధనను అందించడం జరుగుతుందని, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోని చేర్పించాలని అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. విద్యతో పాటు ఆటపాటల్లో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. బాలురు, బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల కాగానే డిగ్రీ కళాశాలలకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ నర్సింగ్‌రావు, డాక్టర్ అనిత, డాక్టర్ రాణి, జావీద్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని కురుక్షేత్ర పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా నమూనా ఎన్నికల్లో పాల్గొన్నారు. నామినేషన్లు దాఖలు చేయడం, ఎన్నికల ప్రచారం, బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఈవీఎంపై ఓటింగ్ విధానం, ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఓటర్లుగా, పోటీ అభ్యర్థులుగా విద్యార్థులు, ఎన్నికల అధికారులుగా ఉపాధ్యాయులు వ్యవహరించారు. దీంతో పాఠశాలలో ఎన్నికల వాతావరణం నెలకొంది. అనంతరం మండల విద్యాధికారి కిషన్ గుప్తా, స్థానిక ఎస్సై అప్పారావు హాజరై ఎన్నికల విధానం, ఓటు గొప్పదనం గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయులు లక్కం శంకర్, చిన్నారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సబ్బిడి నవీన్ కుమార్, యాజమాన్య సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి పథకాలు అమలయ్యేలా కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్ధాన్ సమాజంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా కృషి చేస్తామని రాష్ట్రీయ జనజాతీ పర్ధాన్ ఉర్దన్ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడం రాంకిషన్ అన్నారు. శనివారం పట్టణంలో సమావేశం నిర్వహించి, ఫిబ్రవరి 12న హీరాసుక జయంతిపై చర్చించి ఘనంగా నిర్వహించేలా తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సీడం రాంకిషన్ మాట్లాడుతూ హీరాసుక జయంతి కచర్‌గడ్‌లో వైభవంగా నిర్వహిస్తారని, ఆదిలాబాద్ నుంచి పెద్ద ఎత్తున తరలివేళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా పర్ధాన్ ఉద్దని సంఘటన్‌లో రాష్ట్ర పదవుల కోసం ఆదిలాబాద్ నుంచి పేర్లను ప్రతిపాధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కుర్సెంగ తానాజీ, రాష్ట్ర అధ్యక్షురాలు సిడం గిరిజ, జిల్లా అధ్యక్షుడు మేస్రం శంకర్, ప్రధాన కార్యదర్శి ఉయికే హీరాజీ, అసెంబ్లీ కన్వీనర్ కనక విఠల్‌రావు, రాయిసెంటర్ సార్మెడి బలరాం ఉయికే, వనిత గేడం పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మావల మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు గణతంత్ర వేడుకలకు ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు జెండా ఆవిష్కరణకు ప్రతి ఒక్కరూ గణతంత్ర వేడుకలకు హాజరుకావాలని అధికారులు కోరారు.